# ఫైనాన్స్




హేమా పద్మినీదేవి

NAGESWARRAO

రవి దాదాపు అరుస్తున్నట్టు అన్నాడు.

''ఇది పూర్తిగా నా వ్యక్తిగత విషయం. ఇందులో నీ జోక్యం అనవసరం. అయినా పెళ్లి చేసుకుని జీవితమంతా భరించవలసినవాడిని. నాకు ఇష్టంలేని అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకోమంటారు?''

ఒకప్పటి అడ్డాలలోని నా బిడ్డ గడ్డం మొలిచి ఇవ్వాల్టికి నా పెద్దరికాన్ని తీసి పారేసేంతటి వాడయ్యాడంటే నాకు ఏడుపు రాలేదు. వాడిలోని స్వార్థం నన్ను భయపెట్టింది. నా పెంపకంలో లోటు వుందా? లేదే! ఎంత ఆరోగ్యకరమైన వాతావరణంలో వాడిని పెంచాను? కాని, జీన్స్‌ని నమ్మితే- వాడి తండ్రిలోని దౌర్జన్యం, దుర్మార్గం వాడిలో మూర్తీభవించాయి. తనకో రూపాయి లాభం వస్తుందంటే ఎదుటివాడు నాశనమయిపోయినా ఫర్వాలేదు అనే వికృతమైన స్వార్థం




శ్రీరామ్ పోలికే! రవి రెండేళ్ల పసివాడుగా వుండగానే చట్టబద్ధంగా నానుంచి విడిపోయిన నా భర్త నీడ కూడా వాడిపై పడలేదే! అయినా తండ్రిలోని దుర్గుణాలు వీడికెలా వచ్చాయి? నా పిచ్చిగానీ, విత్తనం ఒకటి వేస్తే చెట్టు మరొకటి మొలుస్తుందా?

నన్ను రవి మాటలు బాధించలేదుగాని, గాయత్రిని తలుచుకుంటే గుండె పిండినట్టయింది. ''ఆలోచించు రవీ! నీమీదే ఆశలు పెట్టుకున్న గాయత్రి ఇప్పుడు నువ్వు కాదంటే ఏమయిపోతుంది?'' నచ్చచెప్పే ధోరణిలో అన్నాను.

''ఇంక ఆలోచించేదేమీ లేదు. ఆ వికలాంగురాలిని చేసుకోడానికి నేను సిద్ధంగా లేను'' రవి స్థిరంగా అన్నాడు. ''డబ్బు లేకపోయినా ఫర్వాలేదు. ఏదో కాస్త అందంగానే వుంటుందిలే అని పెళ్లి చేసుకుందామను కున్నానేగాని, చూస్తూ చూస్తూ ఆ సొట్టకాలి దాన్ని చేసుకోవలసిన కర్మ నాకేమిటి?''

''కాదు రవీ! తాంబూలాలు పుచ్చుకుని పెళ్లికి ముహూర్తం పెట్టుకున్నాక ఇప్పుడు నువ్వు ఆ అమ్మాయిని చేసుకోనంటే, ఆ అమ్మాయి భవిష్యత్తు ఏమవుతుంది? ఆ కుటుంబం పరువేమవుతుంది?''

''అందరినీ కలిసి ఏ నూతిలోనో దూకి చావమను. గాయత్రిలోని లోపం గురించి నాకు చెప్పకుండా దాచినందుకు వాళ్లకదే శిక్ష'' రవి వెళ్లిపోయాడు. నేను వాడిని ఆపలేదు. రవితో గొడవ పెట్టుకోవడం నా అభిమతమూకాదు.

తలుపు చప్పుడయింది. తిరిగి చూసాను. గాయత్రి!

నెలరోజులక్రిందట రవి ఇంటికి తీసుకొచ్చి నప్పుడు చూసానా అమ్మాయిని. గాయత్రి అందగత్తే! సందేహంలేదు. కాని, ఆమె నడకలో అసహజత కొట్టవచ్చినట్టు కన్పిస్తోంది. మరి రవి ఆ విషయాన్ని గమనించాడో లేదో నాకు తెలియదు. గాయత్రిని చూస్తున్నప్పుడు రవి కళ్లలోని వింత వెలుగు, మాటలలో ఆమెపై వ్యక్తమవుతున్న ఆరాధన చూస్తే గాయత్రితో వాడుపీకలోతుదాకా ప్రేమలో మునిగిపోయాడని

అర్థమయింది నాకు. రవి అంతగా ఇష్టపడ్డాక ఆ అమ్మాయి నడకలోని లోపం గురించి నేను వాడితో చెప్పడం సమంజసం కాదు కదా! అందుకే రవి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పినప్పుడు అభ్యంతరపెట్టలేకపోయాను.

గాయత్రి తండ్రి నా దగ్గరకి వచ్చి మాట్లాడడం, నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోవడం అన్నీ చకచక జరిగిపోయాయి. ఇది జరిగి వారం రోజులు అయింది. రవి హఠాత్తుగా నా దగ్గరకి వచ్చి గాయత్రిని పెళ్లి చేసుకోనని ప్రకటించాడు.

ఆలోచనలలో నుంచి తేరుకుని గాయత్రిని చిరునవ్వుతో ఆహ్వానించాను. ఆమె సంశయంగా నిలబడింది. ''కూర్చో'' అన్నాను.

ఆమె నాకెదురుగా కూర్చుంది. ఎర్రబడిన కళ్లు, ఉబ్బిన కనురెప్పలు ఆమె చాలాసేపటినుంచి ఏడుస్తోందనడానికి నిదర్శనంగా వున్నాయి. ఆ అమ్మాయిని చూస్తే నాకు జాలివేసింది. ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. ''రవి మీకేమైనా చెప్పాడా ఆంటీ?'' ఆమె అడిగింది.

ఆమె స్వరం చిన్నగా కంపిస్తోంది.

''ఏ విషయం?''

''నన్ను పెళ్లి చేసుకోనని''

''చెప్పాడు. ఇంతవరకు వచ్చాక పెళ్లి విరమించుకోడం మంచిది కాదని చెప్పాను కూడా! కాని, వాడు నామాట వినడంలేదమ్మా!'' నా అశక్తతను వెలిబుచ్చడానికి నేనేం సిగ్గుపడలేదు.

''నేను రవిని మోసం చేసాను ఆంటీ! నా అంగవైకల్యాన్ని దాచిపెట్టి అతన్ని పెళ్లి చేసుకోవాలనుకున్నాను. మా అమ్మానాన్నలు నాలోని లోపం గురించి చెప్తే నాకీ జన్మలో పెళ్లవదని భయపడ్డారు. కాని నేను చేసిన తప్పుకి ఇంత పెద్ద శిక్ష పడుతుందని అనుకోలేదు. నేను బాధపడుతున్నది నా పెళ్లి ఆగిపోయిందని కాదు. పెళ్లి కాకుండానే రవి నన్ను...'' గాయత్రి ఏడుస్తోంది.

నేను వూహించని విషయం ఆమె చెప్పడంతో నిర్విణ్ణురాలినయ్యాను.

ఒక అమ్మాయిలో ఆశలు రేపి, పెళ్లికి ముందే ఆమె శీలాన్ని దోచుకుని, ఆమె అంగవైకల్యం గురించి తెలుసుకుని ఆమెని నిర్దాక్షిణ్యంగా తిరస్కరిస్తున్న ఘనుడు నా కొడుకు!'' గాయత్రితో అదే అన్నాను.

గాయత్రి ముఖం ఎర్రబడింది.

''అదేమీ కాదాంటీ! అసలేం జరిగిందంటే.. ఏమీ అవలేదు'' తడబాటుగా ఆగిపోయింది.

''అంతవరకు వచ్చాక గాయత్రిని శీలవతిగా వదిలేసిన నా కొడుకెంత ఉదార హృదయుడు!''

''ఈ విషయం నేనింకా నాన్నగారితో చెప్పలేదు. నా పెళ్లి ఆగిపోయిందని తెలిస్తే అమ్మ గుండె ఆగిపోతుంది! నాన్న పిచ్చివాడవుతాడు!'' వెక్కిళ్లమధ్య అంటోంది గాయత్రి.

నేను ఆ అమ్మాయిని దగ్గరకి తీసుకుని ఓదార్చసాగాను.

★ ★ ★

రెండునెలల తర్వాత రవి ఒక అమ్మాయిని వెంటపెట్టుకుని వచ్చాడు.

''అమ్మా! ఈ అమ్మాయి పేరు నాగమణి!'' అని పరిచయం చేసాడు.

నేను చిరునవ్వుతో ఆమెని ఆహ్వానించాను. నాగమణి నాకెదురుగా కూర్చుంది. నేను [illegible] పరిశీలిస్తున్నాను. ఆమె అందగత్తేమీ [illegible] ఆకర్షణీయంగా కూడా లేదు. మరి రవి [illegible] ఏం చూసి ఆకర్షింపబడ్డాడు?

నా ప్రశ్నకి జవాబు ఆరాత్రే దొరికింది నాకు.

''నేను నాగమణిని పెళ్లి చేసుకుంటాను'' అన్నాడు రవి జరగబోయేదాంట్లో నా యిష్టం, ప్రమేయం లేవని స్పష్టం చేస్తూ.

''నాగమణి నీకు అంతగా నచ్చిందా? ఆమె అంత అందగత్తె ఏమీకాదే!'' అన్నాను.

''పెళ్లికి అందం ఒక్కటే ప్రధాన అర్హత కాదు. నాగమణి తండ్రికి ఒకర్తే కూతురు. పైగా ఆస్తి అంతటికీ ఏకైక వారసురాలు!''

''ఎంత కేలిక్యులేటెడ్‌గా మాట్లాడుతున్నాడు! వీడికి డబ్బుపిచ్చి బాగా పట్టింది'' నా కోపం నషాళానికి అంటింది. తమాయించుకుని వాడికేసి ప్రశాంతంగా చూసాను.

''రేపు ప్రొద్దుట నన్ను గుడికి తీసుకెళ్లాలి నువ్వు.''

''డ్రైవర్ వున్నాడుగా వెళ్లు''

''డ్రైవర్‌కి జ్వరం. నాలుగురోజులు సెలవు పెట్టాడు'' అన్నాను. ''ఇంతకీ నాగమణిని పెళ్లి చేసుకోబోతున్న విషయం వాళ్ల నాన్నగారికి తెలుసా? మీ ఇద్దరే నిర్ణయించుకుని ఏ రిజిష్టర్ మ్యారేజ్ ప్లాన్ చేసుకున్నారా?''

''నాగమణిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్న విషయం ఆమెకే చెప్పలేదు నేను. ముందుగా ఏ ఆడపిల్లనీ పెళ్లిదాకా తీసుకెళ్లను నేను. ముందు ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే నాకేం లాభమో ఆలోచిస్తాను. తరువాత స్నేహం చేస్తాను. స్నేహం వలన ఆ అమ్మాయిని మరింత డీప్‌గా స్టడీ చెయ్యడానికి వీలవుతుంది. రెండోది ఒక ఆడపిల్లతో సినిమాలకి, షికార్లకి వెళ్లిన థ్రిల్ దక్కుతుంది!''

''నాగమణిని పెళ్లి చేసుకోవాలని ఎప్పుడు నిశ్చయించుకున్నావు? ఆ అమ్మాయిని బాగా స్టడీ చేసాకా?'' వ్యంగ్యపు పదును నా స్వరంలో ధ్వనించకుండా జాగ్రత్తపడ్డాను.

''అవును. ఆ అమ్మాయి తండ్రి ఆస్తి వివరాలు తెలిసాక నా నిర్ణయం బలపడింది.''

ఓరి వెధవా! అనుకున్నాను. ఎంత దిగజారిపోయాడు. ఇంకా నయం. నేను నా ఆస్తి వివరాలేవీ వాడికి ఇంతవరకు చెప్పకపోవడం మంచిదయింది. ఇవాళో, రేపో ఆస్తి వాడి చేతిలో పెట్టి, వాడికి పెళ్లిచేసి విశ్రాంతి తీసుకుందామనే ఆలోచనలో వున్నాను. నా ఆలోచన ఎంత తప్పో అర్థమయింది నాకు.

''మన ఆస్తి విలువ ఎంతమ్మా?'' ఆస్తి గుర్తు రాగానే అమ్మ విలువ కూడా గుర్తువచ్చినట్టుంది వెధవకి. ''అమ్మా'' అని ఆప్యాయంగా పిలిచాడు.

''పది లక్షలు వుంటుంది!''

''నాగమణి తండ్రికి అయిదారు లక్షల విలువచేసే ఆస్తి వుంది. మొత్తం పదిహేను!''

## గుర్తులేదు

''శ్యామలా, మనకి ముగ్గురు పిల్లలు కదా. కాని నాకు మాత్రం నువ్వు రెండుసార్లే పురిటికి పుట్టింటికెళ్లినట్లు గుర్తు. మొదటిసారి నువ్వు పురిటికి మీ పుట్టింట్లో ఉన్నప్పుడు, మనింట్లో సీతాలు పని మనిషిగా వుండేది. రెండోసారి వెళ్లినప్పుడు రత్తాలుండేది. మరి మూడోసారి వెళ్లినపుడూ...''

''అప్పుడు మీరు హైదరాబాదు ట్రైనింగులో ఉన్నారు. మనింట్లో ఏ పనిమనిషీ లేదు.''

''అలా చెప్పు. అందుకే గుర్తు లేదు.'' అసలు సంగతి గ్రహించాడు శ్యామలరావు.

- వి.వి. సీతారామదాసు (గుంటూరు)

తనలో తనే అనుకుంటున్నట్టు అన్నాడు.

''సరేగాని, రేపు ప్రొద్దుట గుడికి తీసుకెళ్లడం మరచిపోకు'' అన్నాను.

''అలాగేలే'' అన్నాడు వాడు.

★ ★ ★

గుడి ముందు కారాపుతూ ''నువ్వు త్వరగా దర్శనం ముగించుకుని రా! చాదస్తంగా పూజలు అవీ చేయిస్తానంటే కుదరదు'' అని వార్నింగ్ ఇచ్చాడు రవి.

''అదేమిటిరా! నువ్వు కోరుకున్న పిల్లతో నీ పెళ్లి అయితే పూజ చేయిస్తానని మొక్కుకున్నాను'' అన్నాను డోర్ తెరిచి దిగుతూ.

విసుగ్గా ఏదో అనబోయిన మావాడి నోరు తెరిచినది తెరిచినట్టే వుండిపోయింది. షాక్ తిన్నట్టు స్తంభించిపోయి నిలువు గుడ్లేసుకుని ఎటో చూస్తున్నాడు. కాస్తదూరంలో ఆగిన ఎరుపురంగు మారుతీకారుని, అందులోనుంచి దిగుతున్న గాయత్రిని అప్పుడు చూసాను. ఆమె కూడా నన్ను చూసింది. కాని, నన్ను పలకరించలేదు. నన్ను అక్కడ చూడనట్టే వెళ్లబోయింది.

నేనే పలుకరించాను.

''బాగున్నావా గాయత్రీ''

''ఆ! బాగున్నాను ఆంటీ. మీరెలా వున్నారు?'' గాయత్రి తప్పనిసరి అన్నట్టు మాట్లాడుతోంది.

''ఆ కారెవరిది? నీ ఫ్రెండ్‌దెవరిదేనైనా?'' కుతూహలంగా అడిగాను.

''నాదే! ఎవరో అమ్మేస్తుంటే మొన్ననే కొన్నాను. మీకు తెలియదు కదూ? మా అమ్మమ్మ చనిపోతూ అయిదు లక్షల రూపాయలు నాపేర పెట్టింది. అవిటిదాన్నని నాపై జాలి ఆవిడకి. ఈ కాలితో ఎక్కువ దూరం నడవలేను కదా! అందుకే కారు కొనుక్కున్నాను'' చెప్పి గాయత్రి హుందాగా ముందుకి నడిచింది.

నేను రవి వైపు చూసాను. వాడి తెరచివున్న నోట్లో ఈగలు దూరబోతున్నాయి.

''నోరు మూసుకోరా! ఈగలు దూరబోతున్నాయి'' గుడిలో పూజ జరుగుతున్నంతసేపు మావాడి దృష్టి ఎదురుగావున్న గాయత్రి మీదే నిలవడం గమనించాను. వాడి చెవి దగ్గర రహస్యంగా అన్నాను.

''నాగమణిని పెళ్లి చేసుకోబోతూ గాయత్రి వైపు చూడడం తప్పు! పరాయి ఆడది తల్లితో సమానం.''

మావాడు పట్టుబడ్డట్టు చూసాడు.

తిరిగి ఇంటికి వస్తుంటే అన్నాడు రవి.

''నాగమణికి కారు లేదు!''

నేను నా పక్కనే కూర్చున్న ఆరడుగుల రవిని చూస్తున్నాను. కాని, వాడు మానసికమైన మరుగుజ్జు అని నాకు తెలుసు.

మరునాడు ప్రొద్దుట వాడు బ్రేక్‌ఫాస్ట్ తింటూ చెప్పాడు.


''నేను గాయత్రిని పెళ్లి చేసుకుంటాను.''

''అదేమిటిరా! నిన్ననే కదా నాగమణిని చేసుకుంటానన్నావు'' విస్తుపోతూ అడిగేను.

''గాయత్రిని పెళ్లి చేసుకోవడం వలన నాకు నష్టమేమీ కనిపించలేదు. ఆ అమ్మాయి అసాధారణమైన అందగత్తె. నాగమణి అందంగా వుండదు. నాగమణికెంత ఆస్తి వుందో గాయత్రికీ అంతే వుంది.''

నేను సీరియస్‌గా అన్నాను.

''కాని, గాయత్రి వికలాంగురాలు.''




''అది ఒక పెద్ద లోపమని నేను అనుకోవడం లేదమ్మా! భగవంతుడు మనుషులందరినీ ఒకలాగ సృష్టించడు కదా! నువ్వు వాళ్ల నాన్నగారితో మా పెళ్లి విషయం మాట్లాడు.''

రవి గాయత్రిని పెళ్లి చేసుకుంటానంటున్నది ఆమెపై ప్రేమతోనో, లేక ఆమెపై జాలితోనో కాదు. ఆమె ఆస్తి కోసం! ఆ విషయం నాకు స్పష్టంగా తెలుసు. రవి లాంటి ధనకాంక్ష వున్న వ్యక్తిని పెళ్లి చేసుకున్న గాయత్రే కాదు, మరే ఆడపిల్లా సుఖపడదు. కాని, పెళ్లికి ముందే రవి తనపై చొరవ తీసుకున్నందుకు తను అపవిత్రమైందన్న భావనతో కుమిలిపోతోంది గాయత్రి!

రవి తనని తిరస్కరించాక, తండ్రి తనకి సంబంధాలు చూస్తుంటే తిరస్కరించిందని కూడా విన్నాను.

నేను గాయత్రి తండ్రి దగ్గరకి వెళ్లి మాట్లాడాను. సరిగ్గా వారం తర్వాతే గాయత్రి నా కోడలయింది.

నేను చేసిన పని న్యాయమో అన్యాయమో నాకు తెలియదు. గాయత్రి తన మంచితనంతో రవిలో మార్పు తేగలదనే నమ్మకం నాకు వుంది. వధూవరులుగా నా పాదాలకి నమస్కరిస్తున్న రవిని, గాయత్రిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను.

పెళ్లి అలంకరణతో ద్విగుణీకృతమైన అందంతో పుత్తడిబొమ్మలా మెరిసిపోతున్న గాయత్రిని మురిపెంగా చూసుకుంటున్న రవిని చూసి నాలో నేను నవ్వుకున్నాను.

రవి చేత తిరస్కరింపబడిన గాయత్రిని ఓదార్చి, ఆమెకి అయిదు లక్షల రూపాయలు నేనే ఇచ్చానని, ఆమె అమ్మమ్మ ద్వారా ఆమెకి ఆస్తి సంక్రమించడం అనేది నేను, గాయత్రి, ఆమె తల్లిదండ్రులు కలిసి ఆడిన నాటకమని రవికి ఎప్పటికీ తెలియదు.

వాడు ప్లస్ అనుకుంటున్న గాయత్రి ఆస్తి వాడి ఆస్తిలో మైనస్ అని కూడా వాడికి తెలియదు.

★